# పెద్దరికం

ఆమె పేరు, ఆదిలక్ష్మి. కాని అందరూ 'లక్ష్మి' అనే పిలుస్తారు. మనిషి సన్నగా, పొట్టిగా, నీటుగా ఉంటుంది.

మనసులో ఎన్ని బాధలున్నా, ఎంతో మనో వ్యధ ఉన్నా, ఆమె పెదాలపై ఎప్పుడూ చిరునవ్వు లాస్యం చేస్తూ ఉంటుంది. మితభాషిణి. ఎవరయినా మాట్లాడితేనే ఆమె మాట్లాడుతుంది. లేకుంటే మౌనవ్రతం పట్టినదానిలా నోరు మెదపదు.

ఆమె చదువుకున్నది కాదు.

ఉద్యోగం చేస్తున్నదీ కాదు.

కేవలం పని మనిషిగా మూడు, నాలుగిళ్ళలో పని జేస్తున్న ఓ సామాన్య స్త్రీ.

పని మనుషుల్లో యీ రోజుల్లో అంత శాంత స్వభావు లుంటారని ఎవ్వరూ అనుకోరు. కాని, యేం లాభం! ఆమె శాంత స్వభావం, మంచి తనం ఆమెకే మాత్రం ఉపకరించలేదంటే ఆశ్చర్యమే.

లక్ష్మి భర్త పేరు సూరినాయుడు. అయితే అతణ్ణి ఆ పేరుతో ఎవ్వరూ పిలవరు. అందరూ 'సూరి' అనే అంటారు. అతని తల్లి కూడా అట్లానే పిలుస్తుంది.

'సూరి' అన్ని విధాలా లక్ష్మికి తగిన భర్తే. కాని, మెతకమనిషి. తల్లికి భయపడే తత్వం పెళ్ళయినా అతనిలో అంతరించలేదంటే, అతని మెతకదనం అర్థమౌతూనే ఉంది. ఎక్కడా యిమడలేక, సైకిల్ రిక్షా తీస్తున్నాడిప్పుడు.

సూరి తల్లి సత్తెమ్మ, చూడ్డానికి సత్యకాలపు మనిషిలా అగుపిస్తుంది గాని, నిజానికి ఆమెలో రాక్షసి ప్రవృత్తి ఉందనే అనిపిస్తుంది, ఆమె ప్రవర్తన పరిశీలిస్తే.

* * *

ఓ రోజు లక్ష్మి పనులు చేసుకుని యింటి కొచ్చేసరికి, ఉదయం పదయ్యింది.

సత్తెమ్మ సర్రున లేచింది. 'ఇంతేళ దాకా యేం జేస్తన్నావే?' అంది, కళ్ళెర్రజేస్తూ.

లక్ష్మికి అత్త విగ్రహం చూస్తేనే భయం. ఇంక, ఆమె రౌద్రావతారంలో ఉండగా చూస్తే, యింక చెప్పాలా? ఏమీ మాట్లాడలేకపోయింది.

"మాట్లాడవేటే?" గద్దించింది సత్తెమ్మ.

"పనులు సేత్తా ఉండిపోయా నత్తా" భయంగానే అంది.

"అక్కడ పన్లుసేత్తూ ఉండిపోతే, యింట్లో పన్లెవడు సేత్తాడే? నీ బాబా?" విసురుగా అంది.

"నా నిప్పుడు సేసుకుంటాన్లే అత్తా .... రోజూ సేత్తున్నవేగా?" అంది మెల్లగా లక్ష్మి.

"కనిపడేసినా వాణ్ణి. ఆడికి తానేం యెవరు జేత్తారే?"

"రోజూ నువ్వే కందా సేత్తున్నావు? ఇయ్యాల కొత్తేటి?" అంది నసుగుతూ లక్ష్మి.

సత్తెమ్మ కళ్ళింతలు చేసింది.

"నా నేటి, నీ నౌకర్నా యియన్ని సెయ్యడానికి? నావల్లగాదు....

రేపట్నించీ నువ్వు పన్లో కెల్లమాకు....ఇంట్లో పన్లు జూడు" ఆజ్ఞాపించింది సత్తెమ్మ.

ఆదిలక్ష్మి నిర్ఘాంతపోయింది. అత్త నిర్ణయానికి, చీటికీమాటికీ అత్త ఎందుకటువంటి నిర్ణయం తీసుకుంటుందో ఆమెకి బోధపళ్ళేదు. నిజానికి కష్టపడుతోంది తాను. మొగుడి ఆదాయానికి, చన్నీళ్ళకు వేణ్ణీళ్ళలా యేదో తన వంతు ఆర్జన చేస్తూ, యిల్లు గడవడానికి దోహదపడుతోంది. అయినా, పని మానేయమనడం అత్తకి ఎంతవరకూ సమంజసంగా ఉందో ఆమె వూహకి అందలేదు.

అలా మౌనంగా ఆలోచిస్తున్న కోడల్ని చూసింది తీక్షణంగా సత్తెమ్మ.

'ఏటలా ఆలోచిత్తన్నావు? పద నోపలికి. పని మానేయమన్నాను మానీడమే! అంతే! నా మాటకి తిరుగు లేదు".... విసురుగానే అంది సత్తెమ్మ.

లక్ష్మి మరేం మాట్లాడలేదు. ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్లు తిరిగినయ్. కళ్ళొత్తుకుంటూ, గుడిసెలోకి వెళ్ళిపోయింది. తన దురదృష్టాన్ని తల్చుకుంటూ, మౌనంగా రోదిస్తూనే, యింటి పనుల్లో నిమగ్నమయింది.

సాయంత్రం ఆరింటికి సూరి యింటికొచ్చేశాడు. వస్తూనే లక్ష్మిని యింట్లో చూసి విస్తుపోయాడు. ఎందుకూ అంటే, ఆ సమయానికి లక్ష్మి యెన్నడూ యింట్లో అగుపించేదీ కాదు. పన్లోకి వెళ్ళేది. కాని, ఆ రోజు ఆమె యింట్లో ఉన్నందుకే ఆ ఆశ్చర్యం!.... "ఏటే లచ్మీ, యియ్యాల పన్లోకి యెల్లనేదా యేటి?" బట్టలు మార్చుకుంటూ అడిగాడు, సూరి.

లక్ష్మి జవాబు చెప్పాలనుకున్నంతలో సత్తెమ్మ అందుకుంది.

"నానే యల్లొద్దన్నాన్రా సూరీ! అది పన్లోకి బోతే యీ ముసలదాన్ని నాను సంబాలించనేక పోతున్నాన్రా! ఒక్క పక్క యింటిపన్లు సెయ్యాల, యీణ్ణి సంబాలించాల.... యెట్టా కుదురుద్ది!" అంది దీర్ఘం తీస్తూ.

సూరికి తల్లంటే భక్తి అనడం కంటె, భయమనడమే సబబుగా ఉంటుంది. అందుకని, మరేవీ అనలేకపోయాడు. అంటే, యే ఉపద్రవం ముంచుకొస్తుందోనని సూరి భయం.

భర్త మౌనంగా ఉండిపోవడం జూసి, లక్ష్మి మరింతగా బాధపడి

పోయింది. ఇంటి యజమానిగా పరిస్థితుల్ని అతనెందుకు అర్థం చేసుకోవడంలేదా అని ఆమె బాధ.

ఆ రాత్రి—

సత్తెమ్మ యింటి బైట పడుకుంది. సూరి, లక్ష్మి లోపల పడుకున్నారు....

లక్ష్మి ఇంతకు మునుపెప్పుడూ భర్తతో యే విషయాన్నీ చెప్పేది కాదు. అత్త యెలా చెబితే అలా నడుచుకు పోవడమే సంసార జీవితంలో ఆమె నేర్చుకుంది. కాని, ఇప్పుడు, తమ యింట్లో వస్తున్న మార్పుల్ని, కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా, భర్తతో చెప్పాలనే నిర్ణయించుకుంది. అందుకు తగ్గ గుండె నిబ్బరాన్ని తెచ్చిపెట్టుకుంది.

"మావా" మెల్లగా అంది లక్ష్మి.

"ఏటే?" అన్నాడు సూరి.

"అయితే, నాను పన్లోకి యెల్లొద్దంటావా?"

"అమ్మ సెపుతుంటే, మరింకెందుకే పన్లోకి? మానీ."

"అంతే గాని, నువ్వాలోసించవన్న మాట?"

"ఆలోసించడానికేటుందే? మా అమ్మ యెల్లొద్దని సెప్పిందా? మానీ.... ఆయిగా యింట్లో ఉండు."

"ఆ! గొప్ప ఆయినే! నాను మానేత్తే, మొత్తం వంద రూపాయల ఆదాయం తగ్గిపోద్దిగా?"

"తగ్గిపోతే పోనియ్యే! మా అమ్మే సూసుకుంటాది."

లక్ష్మి బరువుగా నిట్టూర్చింది.

"ఏం జూసుకుంటాదో యేటో? కొన్నాల్లు పోయ్యాక, నా కడుపు మాడుస్తది... సూత్తుండు...." రుద్ధ స్వరంతో అంది లక్ష్మి.

ఆ చీకట్లో కనిపించలేదు గాని, సూరి సన్నగా నవ్వేశాడు.

"అలా గెందుకే అనుకుంటావు? అది నీ బెమ! మా అమ్మ సెప్పినట్టే సెయ్యి, తర్వాత సూద్దాంనే...."

లక్ష్మికి కోపం వచ్చినట్టుంది.

"అంతే గాని," నువ్వు మీ అమ్మని అడగనంటావు?" అంది విసురుగా.

సూరి నసిగాడు. "అమ్మ పెద్దదాయిగదే! ఏటడుగుతాను? తర్వాత యేదో ఆలోసిద్దాంనే! శానా పొద్దోయింది ... పడుకో" అన్నాడు.

లక్ష్మి ఓ నిట్టూర్పు విడవడంమినహా మరేవీ చెయ్యలేక పోయింది.

బాబు మేల్కొని, యేడుపు లంకించుకున్నాడు. వాణ్ణి దగ్గరగా తీసుకుని, బుజ్జగిస్తూ, వాడి భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ, నిద్రదేవత ఒడిలోకి జారుకుంది లక్ష్మి.

సూరి గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు.

* * *

ఆదిలక్ష్మి పనిలోకి వెళ్ళడం మానేసి, నాలుగురోజులు నడిచినయ్.

ఈ నాలుగు రోజులూ, లక్ష్మి యెన్నో అనుభవాలను చవిజూసింది. తెల్లారింది మొదలు, రాత్రి పడుకునేవరకూ, అత్త సత్తెమ్మ అజమాయిషీ తోనే సరిపోతోందామెకి. అప్పుడప్పుడూ సత్తెమ్మ తిట్ల పురాణం వినిపిస్తూనే ఉంది.

ఇన్నాళ్ళూ లక్ష్మి తాను పన్జేసిన యిళ్ళల్లోంచి యేదో టిఫినో, అన్నమో, తెస్తూ ఉండేది. చంటాడి ఆకలి ముందు తీర్చేది. మిగిలితే, తాను తినేది లక్ష్మి. కాని, యిప్పుడు....

చంటాడికి తినడానికేమీ ఉండటం లేదు. ఆకలికి ఓర్వలేక, యేడ్చేవాడు. వాడి రోదన చూసి, లక్ష్మి కంట తడి పెట్టుకునేది. ఆ రోజు ఉండబట్టలేక అత్తని అడిగింది.

"మనం పెద్దోళ్ళం యెట్టాగో ఆకలితో ఉండి పోతాం అత్తమ్మా! కాని, సంటాడు వుండలేడు గదా? సూడు యెట్టా కిరకిరనాడిపోతన్నాడో, రొట్టె ముక్కో, యిడ్లీనో తెత్తాను. డబ్బు లియ్యత్తా" అని.

చంటాడిపట్ల జాలి కూడా కలగలేదు సత్తెమ్మకి. ఆమె ప్రవృత్తి అట్లాంటిది. కోడలికేసి యెర్రగా చూసింది.

"ఏటేటి, డబ్బులు గావాలా? నా దగ్గిర డబ్బులు తేరగా పడున్నా యనుకుంటున్నావా యేటే? నేకపోతే నీ బాబు మా యింటో డబ్బు పాతి పెట్టినాడనుకుంటున్నావా? మద్దాన్నంపూట అన్నం తింటాడునే, ఇప్పుడేం కొంప మునిగిపోదు .... అతడి పేరు.... నువ్వు తింటానికి.... అంతేనా?" సతాయించింది, సత్తెమ్మ.

ఆదిలక్ష్మి మనస్సు చివుక్కుమంది. తన కడుపు నింపుకోడానికి, తానెప్పుడూ చూళ్ళేదు. చంటాడి ఆకలి తీరడానికే తాను తాపత్రయపడు తోంది. అటువంటి తనని అత్త అట్లా నిందిస్తుందేటి? .... అనుకుంది. అత్తమీద కోపం వచ్చింది గాని, తన నిస్సహాయతని గుర్తు తెచ్చుకుని, కోపాన్ని దిగమింగుకుంది. "నాకు తింటానికి కాదత్తా! ఆడికోసవే" అంది దీనంగా.

సత్తెమ్మ మనస్సు కరగలేదు. ఆమె మొహంలో అధికార దర్పం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"నువ్వు సెప్పితే నాను నమ్మేత్తా నేంటి? నాకు తెలుసునే" అనేసింది.

కరడుగట్టిన ఆ కఠిన హృదయం యింక కరగదనుకుంది లక్ష్మి. చంటాడు ఏడుస్తూ ఉంటే చూళ్ళేక, మరేమీ చెయ్యలేక, డబ్బాలో ఉన్న చిన్న బెల్లం ముక్క తీసి వాడి చేతిలో పెట్టింది. అంతకంటే తాను మాత్రం యేం చెయ్యగలదు?....అనుకుంది. చంటాడు ఏడుపు మానేశాడు. లక్ష్మి తన పనుల్లో నిమగ్నమయింది.

అప్పుడే చీకటిపడుతోంది. లోకం నల్లని ముసుగు కప్పుకుంటోంది.

సూరి యిల్లు చేరుకున్నాడు. బట్టలు మార్చుకుని, చినిగిపోయిన లుంగీ కట్టుకుని, కాళ్ల చేతులూ, మొహమూ కడుక్కున్నాడు.

"లచ్మీ, బాబేం సేత్తన్నాడే" అడిగాడు, కుక్కి మంచం మీద కూచుంటూ.

"గోలెట్టి, గోలెట్టి పడున్నాడు...."

"గోలెందుకే? ఏటయ్యిందాడికి?"

"ఏటవుద్ది? తిండికేవీ నేదు. నువ్వొచ్చి డబ్బులు తెచ్చిచ్చేవరకూ ఆడుంటాడా యేటి?"

"మా అమ్మ నడక్కపోనావా?"

ఆదిలక్ష్మి మూతి విరుచుకుంది.

"పొద్దుట్నుంచీ అడుగుతానే ఉన్నా .... నేదు నేదనే సెప్తుంది మీ యమ్మ. ఆ దేడుత్తున్నా అదే మాట. ఆడి ఉసురు మనకి తగల్దా యేటి? నా నెంత యిదైనానో నీకేటి తెలుసు?" అంది ఆదిలక్ష్మి.

అప్పుడే యెక్కణ్ణించో వచ్చిన సత్తెమ్మ, కోడలు అంటున్న మాటలు వింది. కయ్యిమంటూ వచ్చింది లోపలికి.

"ఏటే సెబుతున్నావు? నా మీద సాడీలు సెప్పి, మా వోడి మనసు మారి సేత్తావా యేటి?" అంటూ కోడలి జుట్టు పట్టుకుంది.

ఆదిలక్ష్మి యీసారి వూరుకోలేదు. అసలే ఆమెకి కడుపు మండు తుంది. మొగుడు, యెట్లాగూ యేమీ అనడని తెలుసు గనుక, తనే తిరగ బడాలనుకుంది.

రౌద్రంతో ఆదిలక్ష్మి కళ్లు నిప్పులే అయ్యాయి. ఒక్క గుంజా యింపుతో, సత్తెమ్మ పట్టు వదిలింది. అత్తకేసి యెర్రగా చూసింది లక్ష్మి.

"ఈసారి జుత్తు మీద సెయ్యేత్తే వూరుకోనత్తా" అంది విసురుగా.

సత్తెమ్మ స్తంభించిపోయి, కోడలికేసి చూసింది. కోడలిలో హఠాత్తుగావచ్చిన యీమార్పుకి విస్తుపోయింది. అయినా, చప్పున తమాయించు కుంది. "ఏటే. నన్ను యెదిరిత్తన్నావా? సురకలు పెట్టీగల్ను. నాసంగతి నెరికనేదేటి?" అంది కోపంగా.

ఆదిలక్ష్మి భయపడలేదు. ఆమెకి ఆ రోజు మాత్రం, యెక్కడ లేని ధైర్యం వచ్చేసినట్టుంది. "ఎరికేలే గాని, రోజులు మారతన్నాయత్తా, సంటోడు, గోలెడతావుంటే, నీకు యినిపించనేదా? ఆడికేదయినా తిండికి కొంటానంటే డబ్బుల్లేవన్నావు. నూడు, ఆడు గోలెట్టి గోలెట్టి యెట్టా పడుకుండి పోనాడో?"

"నా దగ్గిర డబ్బు న్నేకపోతే యెక్కణ్ణించి తెమ్మంటావే?"

"నాను పన్లోకి బోతే, యేదో టిఫిను, అన్నం తెచ్చుకునేదాన్ని. నన్నేమో పన్లోకి పోవద్దంటివి" .... నసుగుతూ అంది లక్ష్మి.

సత్తెమ్మ కోడలుకేసి తీక్షణంగా చూసింది.

"అదేటేనో గోల? నాకు తెలుసే నీ యెత్తు. నిన్ను పన్లోకి యెల్లొద్దన్నాను.... ఎల్లకు. అంతే! సచ్చినా పంపను...." అంది కోపంగా.

ఆదిలక్ష్మి మొండికెత్తేసింది.

"రేపుట్నుంచీ నా నెల్తాను పన్లోకి" అంది ధైర్యంగా.

సత్తెమ్మకి కళ్ళు తిరిగినట్టయ్యాయి. కోడలికి అంతధైర్యం యెట్లా వచ్చిందో, ఆమెకి బోధ పళ్ళేదు. "ఏటి? ఎల్తావా? ఎట్లా యెల్తావో

సూత్తానే. ఏంట్రా, సూరీ అలా మొద్దులా వల్లకుంటావేటి? నాలుగు తగల్నీరా... దాని రోగం కుదురుద్ది" అంది కొడుకుతో సత్తెమ్మ. ఆమెకి అవమానంతో వొళ్లు దహించుకు పోతోంది.

సూరి యిరకాటంలో పడ్డాడు. ఆ రోజు మధ్యాహ్నమే ఆదిలక్ష్మి మేనమామ వీరాస్వామి సూరికి ఓ డోసిచ్చాడు—ఈసారి లక్ష్మి మీద చెయ్యి చేసుకుంటే ఆ చెయ్యి తీసేస్తానని. అతని హెచ్చరిక సూరి చెవుల్లో గింగురు పెట్టింది. భయంతో గుండెలు కొట్టుకున్నాయి. వీరాస్వామి చిన్న సైజు రౌడీ! వాడు అన్నంతపనీ చేస్తాడేమోనన్న భయం పట్టుకుంది సూరికి. అందుకే, మునుపట్లా తల్లి ఆజ్ఞని అమలు పర్చలేదు.

"పోనీయే అమ్మా! అది పన్లోకి యెల్తానంటే నీకేవే? కట్టపడేది అదే గదే?" అన్నాడు మెల్లగా.

కొడుకులో మార్పు రావడం మరింత కృంగ దీసింది సత్తెమ్మని. ఆమెకి అంతా అయోమయంగా తోచింది. కళ్లింతలు చేసుకుని, కొడుక్కేసి తీక్షణంగా చూసింది.

"ఒరే... ఒరే సూరిగా ....నువ్వూ మారిపోనావట్రా? అదేదో నీకు మూరి పోసిందని పిల్లి కూనవైపోనా వేట్రా? నీకు పవురుషం నేదురా? ఈ తల్లి మాట యెన్నడయినా కాదన్నావురా? మరిప్పుడిలా మారిపోనావేట్రా?" అంది గంభీరంగా.

సూరి ఆ రోజు యే కళనున్నాడో మరి! తల్లి మాటలకి భయపడ లేదు. లక్ష్మి చెప్పిందాట్లో చాలామట్టుకు నిజముందనిపించే సరికి, తల్లి పట్టుదల మూర్ఖంగా ఉందనిపించింది. అధికారం చూపుతుందనిపించింది వాడికి.

"ఏటే అమ్మా, అనా కుత కుత నాడిపోతన్నావు? అది పన్లోకి యెల్తానంటే వద్దంటావేటే? ఎవురైనా యింటే నవ్వుతారమ్మా! అసలు నీ ఆలోసెనేటో నాకర్థం కావడం నేదే" అని సూరి అనగానే, లక్ష్మి అందుకుంది.

"ఇంకేటుందాలోసిన? నన్నూ, నా పిల్లణ్ణి ఆకల్తో సంపడానికి" అంటూ కంట తడి బెట్టుకుంది ఆదిలక్ష్మి.

సూరి మనసు కరిగిపోయింది.

"వూరుకోయే నచ్మీ! రేప్పొద్దుట్నుంచి పనికి యెల్లే....నువ్వు సంపాదించింది నీ దగ్గిరే ఉంచుకో.... అవుసరానికి పనికొస్తది" అంటూ తీర్మానించాడు సూరి.

ఆదిలక్ష్మి ఆనందానికి అంతు లేకపోయింది. ఆమె మొహంలో కొత్త కాంతి చోటు చేసుకుంది.

"అదే నానూ అంటున్నాను మావా...."

సత్తెమ్మకి వొళ్ళు కారం రాసినట్టుగా మండిపోతోంది.

"అంటావే.... అంటావు. ఏవయినా సరే, నువ్వు పన్లోకి యెల్లడానికీల్లేదు" సరికొత్తగా అజ్ఞాపించింది సత్తెమ్మ.

ఆదిలక్ష్మి, ఇంక సహించలేక పోయింది. అత్త అధికార దాహానికి ఆనకట్ట కట్టాలనుకుంది. భర్త మౌనాన్ని ఆసరాగా తీసుకుని బరితెగించింది. "మావే యెల్లమని సెప్పుతుంటే నువ్వెవరివత్తా వద్దనడానికి?" ధ్వజమెత్తింది లక్ష్మి.

సత్తెమ్మకి వొళ్ళు మండిపోయి సమరానికి ఆయత్తమయ్యింది.

"ఏమిటన్నావే? నా నెవర్నా? సూపిత్తానుండు" అంటూ ఆదిలక్ష్మి కేసి విసురుగా వెళ్ళబోయింది సత్తెమ్మ.

ఆదిలక్ష్మి వుగ్గ నరసింహ రూపం దాల్చింది. ఆమె కళ్ళ నుండి నిప్పు రవ్వలు రాల్తున్నట్టయ్యింది.

"అగక్కడ! నా వొంటిమీద సెయ్యేత్తే ఒప్పుకోను, పెద్దదానివని మర్యాదిస్తుంటే, నిలబెట్టుకోనేక పోనావు. మావ యేటి సెప్పితే అదే సేత్తాను. నీ పెద్దరికం నాకొద్దు. నీకిట్టం నేకపోతే యింట్లోనుండి నువ్వే యెల్లిపో" అంది లక్ష్మి, వెనకా ముందూ ఆలోచించకుండా.

సత్తెమ్మ స్థాణువులా ఉండిపోయింది. చివరికి ఎంతగా తెగించింది కోడలు... ? అనుకుంటూ, కోపంతో వూగిసలాడి పోతోంది. కొడుకు కేసి కొర కొర చూసింది.

"ఇన్నావురా యెదవా? నీ పెళ్ళాం ఏటంటందో యిన్నావా? నా నెల్లిపోవాలా? ఏట్టా సెప్పు?" అంది వుద్రేకంగా.

సూరి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. మునుపట్లా చప్పున కోపం తెచ్చుకోలేదు....ఆలోచించాడు. గతంలో ఆదిలక్ష్మిని తన తల్లి యెంతగా హింసించిందీ లీలగా గుర్తుకొచ్చింది. లక్ష్మి సహిస్తూ వచ్చింది. సహనాని కయినా ఒక హద్దు వుంటుంది కదా?! ఇప్పుడు లక్ష్మి యెదురు తిరుగు తున్నదంటే యింక సహించలేకనే. తన సంసారం కోసం ఆదిలక్ష్మి కష్ట పడతానంటే, తన తల్లి ఎందుకు వద్దంటున్నదో అర్థం గాకపోయినా, తల్లి అధికార దాహాన్ని వూహించుకోగలిగాడు.

"ఒలే అమ్మా, యిన్నాళ్ళూ యెదో నీ పెద్దరికం ఉంచినామే! నువ్వెన్ని అన్నా, యెన్ని తిట్టినా ఆదిలక్ష్మి సయించి వూరుకునేదే! అదిప్పుడు యెదురు తిరిగినాదీ అంటే కారణం యేటో నువ్వాలోసించాలే. వన్లోకి పోయి, కట్టపడి, యెప్పటిలాగే నాలుగు పైసాలు సంపాదిత్తానని అదంటావుంటే నువ్వెందుకు వద్దంటన్నావో, నాకే బోధ పల్లేదే అమ్మా, నీ పెద్దరికం ఉంచుకోనానికే యిలా అంటన్నావని నాకనుమానం వత్తందే. నువ్వూ పెద్దదాని వై పోనావు. ఇంక దాని మీద పెద్దరికం సెలాయించకే. ఇకనించీ యింటిని అదే నడుపుతాదే! నువ్వు ఆయిగా ఒకసోట కూసోయే" అన్నాడు సూరి.

లక్ష్మి మొహం ప్రసన్నతతో ప్రజ్వరిల్లింది.

సత్తెమ్మ తల మీద పిడుగు పడినట్టయ్యింది. తాను అగాధంలో పడిపోయినట్టే అనిపించిందామెకు. అధికారంపోతే, అలా అనిపిస్తుందేమో మరి. అసహనంతో వూగిపోయింది.

"ఒరే సూరిగా, యేట్రా యిట్టా మారిపోనావు? ఈ ముండ నీకేదో మందు పెట్టేసినాది. దీన్ని... దీన్ని...." అంటూ అదిలక్ష్మి మీదికి వెళ్ళ బోయింది.

"ఆగే అమ్మా! ఒలేయ్ అమ్మా! రోజులు మారిపోతన్నాయ్. మును పటి రోజులు కావు. గురుతుంచుకోయే! లచ్చిమి మేనమావ ఉన్నాడు స్పూసినావా.... యెవడు? ఓడ్లేనే ఘూరాసావి.... ఆడు మనిద్దరినీ అవిటోళ్ళని

నేసీగల్లు.... అందుకే పెద్రేగిపోకు" అంటూ అసలు విషయం చెప్పాడు సూరి.

సత్తెమ్మకు యిప్పుడర్థమయింది. కొడుకు మార్పుకి కారణం యేవిటో. ఏడుస్తూ బైటకి వెళ్ళిపోయింది.

ఆదిలక్ష్మి సూరిని అమాంతం కౌగలించుకుంది.

"నువ్వెంత మంచోడివి మావా...." అంది, కిల కిలా నవ్వుతూ. సూరి నిండుగా నవ్వేడు.

* సోవియట్ భూమి, జనవరి, 1991 *